# సంఘముల రిజిస్ట్రేషన్

ఏడుగురు లేక ఎక్కువ మంది వ్యక్తులు కలిసి కళలను, లలిత కళలను, హస్తకళలను, క్రీడలను, సాహిత్యమును, సంస్కృతిని, విద్యను విజ్ఞానమును, వినోదమును, ధార్మికతను, ఆధ్యాత్మికతను మొదలగు వాటిని ప్రోత్సహించడానికి లేక అభివృద్ధి చేయడానికి లేదా ప్రజా సంక్షేమ కార్యక్రమములను చేపట్టి కొనసాగించడానికి ఒక సంఘమును లేక సొసైటీని ఏర్పాటు చేసుకొని రిజిస్టరు చేయించుకొన వచ్చును. అట్టి వ్యక్తులు మేజర్లై ఉండవలెను.

అట్టి సంఘము లేక సొసైటీలో కనీసము ఏడుగురు సభ్యులు ఉండవలెను. సొసైటీ యొక్క కార్య నిర్వాహక కమిటీలో కనీసము ముగ్గురు సభ్యులుండవలెను. భాగస్వామ్య సంస్థలు, వ్యాపార సంస్థలు అట్టి సంఘములలో సభ్యులుగా ఉండరాదు.

సంఘమును రిజిస్టరు చేయించుకొనుటకు, సంఘము యొక్క పేరు, చిరునామాలను; సంఘము యొక్క లక్ష్యములను, ఉద్దేశములను, మరియు కమిటీ సభ్యుల పేర్లను, చిరునామాలను, వయస్సు మరియు వృత్తులను పేర్కొనుచు ఏడుగురు సభ్యులచేతను, మరియు ఇద్దరు సాక్షుల చేతను సంతకములు చేయబడిన ఒక మెమోరాండమ్‌ను, సంఘ కార్యకలాపములను నిర్వహించుటకు తయారు చేసికొనిన నియమావళిని, రూ. 500ల రుసుము చెల్లించి "మీ సేవ" వారి ద్వారా సంబంధిత జిల్లా రిజిస్ట్రారు వారికి పంపవలెను. నియమావళి పై కూడ కమిటీ సభ్యులు సంతకములు చేయవలెను.

నియమావళిలో ముఖ్యముగా ఈ క్రింది విషయములను పొందుపరచవలెను:

1. సంఘము యొక్క పేరు, చిరునామా
2. సంఘము యొక్క లక్ష్యములు మరియు ఉద్దేశముల సాధనకు సంఘము చేయదలచిన కార్యకలాపములు
3. సభ్యత్వమునకు అర్హతలు, రుసుము, సభ్యులుగా ప్రవేశించుట, వైదొలగుట, తొలగించబడుట,
4. సర్వసభ్య సమావేశములు, కోరమ్, విధులు, బాధ్యతలు, అధికారములు,
5. కమిటీ సభ్యుల నియామకము, ఎన్నికలు: వారి పదవీకాలము, విధులు, బాధ్యతలు, తొలగింపు
6. కమిటీ సమావేశములు, కోరమ్
7. ఆదాయ వనరులు, నిధులు, ఆడిటర్ల నియామకము, ఆడిట్ నివేదికలు, సభ్యుల బాధ్యతలు.
8. అంతర్గత వివాదముల పరిష్కారము
9. సంఘము యొక్క రద్దు లేక విభజన లేక వేరే సంఘముతో విలీనము చేయునప్పుడు అనుసరించవలసిన విధానము, మొదలగునవి.

సంఘము వ్యాపార నిమిత్తముతో గాని, లాభాపేక్షతో గాని ఏర్పడలేదనియు, సమస్యల పరిష్కారము కొరకు సంఘము ఉద్యమములను, ఆందోళనలను చేయదనియు, కమిటీ సభ్యులకు జీతములు చెల్లించుట లేదనియు మెమోరాండమ్‌లో ధృవీకరించవలెను.

సంఘ కార్యాలయము అద్దె భవనములో ఉంటే భవనయజమానితో వ్రాసికొని రిజిస్టరు చేయించుకొన్న అద్దె దస్తావేజు నకలును జతపరచవలెను. అద్దె భవనములో లేని యెడల ఆ విషయమును ఒక అఫిడవిట్ ద్వారా ధృవీకరించవలెను.

సంఘము యొక్క పేరు "ఎంబ్లమ్స్ అండ్ నేమ్స్ (ప్రివెన్షన్ ఆఫ్ ఇంప్రాపర్ యూజ్) 1950" అను చట్టమునకు లోబడి ఉండవలెను. సహకార, భూమి అభివృద్ధి, రిజర్వు బ్యాంకు, కేంద్ర, రాష్ట్ర, మునిసిపల్ లేక ఛార్టర్డ్ మొదలగు పదములను రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా సంఘము పేరులో ఉపయోగించరాదు. ఒక జిల్లాలో ఇంతకు పూర్వమే రిజిస్టరైన సంఘము యొక్క పేరును వేరే సంఘము ఉపయోగించరాదు.

పై సూచనల ప్రకారము తయారుచేసి, “మీ సేవ” ద్వారా దాఖలైన మెమోరాండమ్, నియమావళి మరియు ఇతర పత్రములను రిజిస్ట్రారువారు పరిశీలించి, సక్రమముగా ఉన్నట్లు సంతృప్తి చెందిన మీదట సంఘమును రిజిస్టరు చేసి ధృవీకరణ పత్రమును జారీ చేయుదురు. రిజిస్ట్రారువారు రిజిస్టరు చేయుటకు తిరస్కరించిన యెడల, అరవై రోజులలోగా ప్రభుత్వము వారికి అప్పీలు చేసుకొనవచ్చును.

రిజిస్టరైన సంఘములు ప్రతి సంవత్సరము సర్వసభ్య సమావేశము జరిగిన తేదీనుండి పదిహేను రోజులలోగా కమిటీ సభ్యుల పేర్లు, చిరునామాల జాబితాను, వారి విధుల వివరములను, రిజిస్ట్రారుకు సమర్పించవలెను. అట్టి సభ్యులలోగాని, వారి వివరములలోగాని మార్పులు, చేర్పులు జరిగినప్పుడు వెంటనే రిజిస్ట్రారుకు తెలిపి, వాటిని నమోదు చేయించుకొనవలెను.

ప్రతిసంఘము కనీసం మూడు నెలల కొకసారి కమిటీ సమావేశమును, సంవత్సరము కొకసారి సర్వసభ్య సమావేశమును జరుపుకొనవలెను.

సంఘము తన పేరును గాని, మెమోరాండమ్‌లో పేర్కొనిన లక్ష్యములు లేక ఉద్దేశములనుగాని, సంఘకార్యాలయము యొక్క చిరునామాను గాని ప్రత్యేక తీర్మానము ద్వారా సవరించుకొనవచ్చును. అట్టి సవరణలను తక్షణమే రిజిస్ట్రారు వారికి సమర్పించి రిజిస్టరు చేయించుకొనవలెను. అట్టి సవరణలు రిజిస్టరు కానిదే చట్టబద్ధముగా అమలులోనికి రావు. సంఘము యొక్క విభజన లేక విలీనము లేక సంఘమును ఉపసంహరించుకొనుట కూడా ప్రత్యేక తీర్మానముల ద్వారానే జరుగవలెను.

నియమావళిని మాత్రము సాధారణ తీర్మానముల ద్వారా సవరించుకొనవచ్చును. అట్టి సవరణలను కూడా రిజిస్ట్రారుకు నివేదించవలెను. అవి చట్ట విరుద్ధము కాని యెడల రికార్డులోనికి తీసుకొనబడును.

కమిటీ సభ్యుల పదవీకాలము సంఘము యొక్క నియమావళి ననుసరించి ఉండును, కాని ఎట్టి పరిస్థితులలోను ఆరు సంవత్సరములకు మించి ఉండరాదు.

ప్రతి సంఘము కార్యాలయ ఆవరణలో తన పేరును ప్రదర్శించవలెను, మరియు తన పేరును తెలుపు ముద్రను కలిగియుండవలెను. సభ్యుల వివరములను తెలుపు రిజిస్టరును వారివారి సంతకములతో సహా నిర్వహించవలెను. రాబడి, ఖర్చులు, ఆస్తులు మరియు అప్పుల వివరములను తెలుపు రిజిస్టర్లను, ఆడిట్ నివేదికలను మినట్స్ బుక్‌ను, కొనుగోళ్ళు, అమ్మకముల లెక్కలను విధిగా నిర్వహించవలెను. సభ్యులందరు వీటిని తనిఖీ చేయుటకు అర్హులు.

సంఘ కార్యకలాపములలో సభ్యుల నడుమగాని, కమిటీ సభ్యుల నడుమగాని, కమిటీ మరియు సాధారణ సభ్యుల నడుమగాని వివాదములు ఏర్పడినప్పుడు అట్టి వాటిని జిల్లా కోర్టు ద్వారా పరిష్కరించుకొనవలెను.

సంఘము రద్దు అయినప్పుడు లేక ఉపసంహరించుకొనుట జరిగినప్పుడు మిగిలిన ఆస్తులు అటువంటి వేరొక సంఘమునకు బదిలీ చేయవలెనేకాని సంఘసభ్యులు పంచుకొనుటకు వీలులేదు.